
తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గద్దం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
3 ఏప్రిల్ 2025
సంపుటి : 276
సంచిక : 2
పేజీలు : 12
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## 400 ఎకరాల్లో చెట్ల నరికివేత చేపట్టొద్దు

- సెంట్రల్ వర్సిటీ భూములపై విచారణ
- నేటికి వాయిదా వేసిన హైకోర్టు
- ఎక్కడ చెట్లను నరకవద్దని ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 తరంగాలు**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ భూముల్లోని చెట్లను గురువారం వరకు కొట్టివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరపు -మిగతా 3 లో




## బీసీలు ధర్మయుద్ధం ప్రకటించాలి

### మా రాష్ట్రంలో ఆమోదించిన బీసీ బిల్లును ఆమోదించండి

- రాహుల్ ఆదేశాల మేరకు బీసీ కులగణన
- గుజరాత్‌లో అమలుచేయాలని మేం కోరడం లేదు
- మా డిమాండ్‌కు మీరు మోకాలడ్డవద్దు
- జంతరమంతర్ బీసీ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 తరంగాలు**
బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన -మిగతా 3 లో



## ఆంధ్రలో తొలి బర్డ్‌ఫ్లూ మరణం

- వ్యాధి సోకి చిన్నారి మృతి


**పల్నాడు, ఏప్రిల్ 2 తరంగాలు**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తొలి బర్డ్ ఫ్లూ మరణం సంభవించింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకి చెందిన రెండేళ్ల చిన్నారి బర్డ్ ఫ్లూ వైరస్ తో మృతి చెందింది. పచ్చి కోడి మాంసం తినడం వల్ల బర్డ్ ఫ్లూ సోకి మరణించిందని ఎయిమ్స్ వైద్యులు ధృవీకరించారు. గత నెల 4వ తేదీన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో మంగళగిరి ఎయిమ్స్‌లో -మిగతా 3 లో



## శాంతి చర్చలకు మేము సిద్ధం

- తెలంగాణలో జరుపుతున్న హత్యాకాండను ఆపాలి'
- శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల వాతావరణం కల్పించాలి
- కేంద్రానికి మావోయిస్టుల లేఖ

**హైదరాబాద్:ఏప్రిల్ 2 తరంగాలు**
గత వందరోజుల్లోనే భద్రతా బలగాలు 120 మందకిపైగా మావోయిస్టులను ఎన్‌కౌంటర్లలో హతమర్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ప్రతిపాదిస్తే.. కాల్పుల విరమణకు -మిగతా 3 లో



## తెలంగాణలో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

- ఏప్రిల్ 30 వరకు పెంచుతు ఆదేశాలు

**హైదరాబాద్**
తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతు ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్ఆర్ఎస్ పక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. -మిగతా 3 లో

## అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు

**నల్లబెల్లి / మార్చి02 తరంగాలు :**
అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన కోడిగుడ్లు అందజేస్తుండటంతో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు.నల్లబెల్లి మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారు. నల్లబెల్లి గ్రామంలోని అంగన్వాడీలో ఇటీవల బాలింతలు, గర్భిణిలకు గుడ్లు పంపిణీ చేశారు. వాటిని ఉడకబెడితే కుళ్లిన వాసన వచ్చాయి. అనుమానం వచ్చి ఉడకబెట్టని గుడ్లను పగులగొట్టగా పాడైపోయి కుళ్లిన వాసన వచ్చాయి. పౌష్టికాహారంలో అందిచాల్సిన అంగన్వాడీల్లో ఇలా నాసిరకం, పాడైపోయిన





గుడ్లు, ఇతర సామాన్లు పంపిణీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు.బుధవారం వాటిని ఉడికించి పై పోట్టును తీయగా కుళ్ళిపోయి పురుగులు బయటకు రావడంతో ఆ కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపాలు అధిగమించేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పౌష్టికాహార పంపిణీ చేస్తోంది. -మిగతా 2 లో



## ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

- విద్యార్థులను చితకబాదిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 తరంగాలు**
హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే -మిగతా 3 లో

## ఆస్తుల పరిరక్షణకే వక్ఫ్ చట్టం సవరణ




- లోక్‌సభలో వక్ఫ్‌చట్ట చట్టసవరణ బిల్లు
- చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు
- లేకుంటే పార్లమెంట్ స్థలం కూడా వక్ఫ్‌దే అంటారు
- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 తరంగాలు**
వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. -మిగతా 3 లో


## తక్కువ కాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత



- భూముల కాపాడటంలో బీఆర్ఎస్ ఎంతో శ్రమించింది
- రేవంత్‌కు పాలన చేతకావడం లేదు : ఎమెల్సీ కవిత

**హైదరాబాద్, ఏప్రిల్ 2 తరంగాలు**
సీఎం రేవంత్ పాలన ఎవరికి అర్థం కావడం లేదని.. ఇంత తక్కువ కాలంలో ప్రజావ్యతిరేకత కూడగట్టుకున్న సీఎం ఆయనే అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో ఉన్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దుశ్చర్య వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయింది కాబట్టి 400 ఎకరాల భూమిని విక్రయించాలని నిర్ణయించారు అని ఆమె అన్నారు. బుధవారం ఆమె మీడియాలో -మిగతా 3 లో

# ముగిసిన పదో తరగతి పరీక్షలు



**హైదరాబాద్ ఏప్రిల్ 2 తరంగాలు**
విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి.టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకోగా.. మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు న్విహించిన ఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నేడు సోషల్ స్టడీస్ పరీక్షతో పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. కాగా, పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ నెల చివరివారంలో విడుదలకానున్నాయి. ఓరియంటల్ సైన్స్‌కు సంబంధించిన రెండు పరీక్షలు ఈ నెల 3, 4 తేదీల్లో జరుగుతాయి. వాటికి కొద్ది మంది మాత్రమే హాజరవుతారని అధికారులు తెలిపారు.

# ఇంటర్ కాలేజీలకు జూన్ 1 వరకు సెలవులు

**సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు: బోర్డు**



**హైదరాబాద్, ఏప్రిల్ 2 తరంగాలు**
తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ కళాశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. ఈ సెలవులు మార్చి 30 నుంచి ప్రారంభమై జూన్ 1, 2025 వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు ఈ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు వేసవి సెలవులను స్వీయ అధ్యయనం, నైపుణ్యాల అభివృద్ధి, ఇతర ప్రయోజనకరమైన కార్యకలాపాలకు వినియోగించుకోవాలని సూచించింది. జూన్ 2నుంచి తరగతులు మళ్లీ ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు వెల్లడించింది. అలాగే, సెలవుల సమయంలో అనధికారికంగా తరగతులను నిర్వహించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# ముస్లింల సంక్షేమానికి వక్ఫ్ ఆస్తులు

**-వక్ఫ్ సవరణకు మద్దతు ఇచ్చిన టిడిపి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 తరంగాలు**
వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగం కాకుండా ముస్లింల సంక్షేమానికి వినియోగించాలన్నదే తమ డిమాండ్ అని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో టీడీపీ ఎంపీ కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. వక్ఫ్ కు రూ. 1.2 లక్షల కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయని అన్నారు. ఈ ఆస్తులు దుర్వినియోగానికి గురయ్యాయని తెలిపారు. ఈ ఆస్తిని ముస్లింల సంక్షేమం కోసం, మహిళల సంక్షేమం కోసం ఉపయోగించాలని తమ పార్టీ కోరుతోందన్నారు. దీనిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. జేపీసీని డిమాండ్ చేసిన మొదటి పార్టీ తమదే అని పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. 97 లక్షలకు పైగా కమ్యూనికేషన్లు జరిగాయని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ బిల్లు 14 సవరణలతో వచ్చిందని.. తమ పార్టీ మూడు సూచనలు ఇచ్చిందన్నారు. ముస్లింల ప్రయోజనాలను కాపాడే మూడు సూచనలను ఆమోదించారన్నారు. తెలుగుదేశం పార్టీ ముస్లింల సంక్షేమం, అభ్యున్నతికి కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు కూర్పును నిర్ణయించడానికి, నియమాలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఇవ్వాలని తాము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తాము వక్ఫ్ సవరణ బిల్లును మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు.

# అంగన్‌వాడీల్లో కుళ్లిన కోడిగుడ్లు







(మొదటి తరువాయి)

ఒక్కో లబ్ధిదారుకు ప్రతినెలా 16 కోడిగుడ్లను అందించాలి. గుడ్లయితే ఇస్తున్నారు కానీ... అందులో నాణ్యత ఉండటం లేదు. ఫలితంగా ఉన్నతమైన లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న పౌష్టికాహార లక్ష్యానికి గండిపడుతోంది. పేదల కోసం ఎంతో ఖర్చుతో నిర్వహిస్తున్న కార్యక్రమం పర్యవేక్షణా లోపంతో గాడితప్పుతోంది.మండల కేంద్రంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలలో కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు గుడ్లపై అనుమానం వచ్చి పగలగొట్టి చూడటంతో కుళ్లిపోయిన గుడ్లు దుర్వాసనతో దర్శనం ఇచ్చాయి.అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేస్తున్నప్పటికీ... అధికారుల నుంచి ఎలాంటి పర్యవేక్షణా లేదని ఇది కాంట్రాక్టర్లకు వరంగా మారిందని,సాధారణంగా ఒక గుడ్డు 50గ్రాములుండాలని కానీ కాంట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న గుడ్లు చాలావరకు నాసిరకంగా ఉంటున్నాయని తక్కువ ధరకు దొరికే... తక్కువ పరిమాణంలో ఉన్న, మురిగిపోయిన గుడ్లు సరఫరా చేస్తున్నారని గుడ్లు చిన్నగా ఉంటున్నాయని, ఉడికించిన గుడ్ల నుంచి దుర్గంధం వస్తోందని అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జిల్లా సంక్షేమాధికారులు చొరవ తీసుకొని అంగన్వాడీ కేంద్రాలను అందిస్తున్న ఆహార పదార్థాలను ప్రత్యేకంగా పర్యవేక్షించి అందించాలని స్థానిక లబ్ధిదారులు కోరుతున్నారు.

**తమకేదైనా అయితే..?**



అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వ లోగో తో సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయగా.. కాంట్రాక్టర్లు మాత్రం కుళ్లిన , చిన్న సైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఎల్లకొండలోని అంగన్ వాడీ సెంటర్ కు కుళ్లిన, చిన్న కోడిగుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేశారు. కొందరు గర్భిణులు, బాలింతలు ఇంటికి తీసుకెళ్లి ఉడకబెట్టగా దుర్వాసన రావడంతో వాటిని పారవేశారు. కొందరు తిరిగి అంగన్ వాడీ సెంటర్ కు తీసుకొచ్చారు. ఈ కుళ్లిన గుడ్లు మాకు ఎందుకు అంటూ పలువురు గర్భిణులు, బాలింతలు ప్రశ్నించారు. తమకేదైనా అయితే బాధ్యులు ఎవరని నిలదీశారు. పై నుంచి ఇస్తున్నారని, తామేం చేస్తామని అంగన్ వాడీ టీచర్లు చెబుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడమే లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు అంగన్వాడీ సెంటర్లను తనిఖీలు చేయాలని గర్భిణులు, బాలింతలు కోరుతున్నారు

# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

**సమయాన్ని పొడిగించిన యాజమాన్యం**



**హైదరాబాద్, ఏప్రిల్ 2 తరంగాలు**
హైదరాబాద్ నగరవాసులకు మెట్రో సేవలు ఎంతో కీలకంగా మారాయి. ఎందుకంటే నగరంలో ఏ ప్రదేశానికి వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్య వల్ల చాలా సమయం పడుతుంది. అదే మెట్రోలో వెళితే.. నిముషాల్లో వెళ్లవచ్చు. అందుకే చాలామంది మెట్రోలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మెట్రో సేవల సమయాన్ని పొడిగించాలని ఎప్పటి నుంచే డిమాండ్ చేస్తున్నారు. మన భాగ్యనగరంలో తక్కువ కాలంలోనే పాపులర్‌గా మారిన మెట్రో రైలు సర్వీసులు విషయంలోనూ అనేక మంది ప్రయాణికులు రాత్రి 12 గంటల వరకు సేవలు సేవలు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. ఎట్టకేలకు అది నెరవేరింది. ప్యాసింజర్లకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది హైదరాబాద్ మెట్రో. మెట్రో రైల్ సమయం పొడిగించారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ సమయాన్ని పొడిగించారు హైదరాబాద్ మెట్రో అధికారులు. మారిన టైమింగ్స్ ప్రకారం.. ఇక మీదట సోమవారం నుంచి శుక్రవారం వరకు.. ఆయా టెర్మినల్ స్టేషన్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో రైలు ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటల 45 నిమిషాల దాకా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. శనివారం నాడు ఆయా టెర్మినల్ మెట్రో స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు తొలి మెట్రో స్టార్ట్ అవుతుంది. రాత్రి 11 గంటల వరకు రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక నుంచి ఆదివారం నాడు ఉదయం 7 గంటలకు ఆయా టెర్మినల్ స్టేషన్ నుంచి ఫస్ట్ మెట్రో రైలు మొదలవుతుంది. సండే కూడా రాత్రి 11 గంటల వరకే రైళ్ల రాకపోకలు ఉంటాయి.

# ప్రొఫెసర్లపై లాఠీచార్జీ బాధాకరం

**రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపిస్తున్న రేవంత్ పాలన**



**హైదరాబాద్, ఏప్రిల్ 2 తరంగాలు**
విద్యావంతులైన ప్రొఫెసర్ల లాఠీచార్జీ చేయడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గత నాలుగు రోజుల నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయం శాంతియుతంగా నిరసన చేపట్టిన ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని రేవంత్ రెడ్డి సోకాల్డ్ ప్రజాపాలన తలపిస్తుందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పచ్చని అడవిని నాశనం చేయొద్దని శాంతియుతంగా నిరసనకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. రేవంత్ సర్కార్ వల్ల ఏ వర్గం ప్రశాంతంగా లేదని విమర్శించారు. మొన్నటి నుంచి మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్.. ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూముల రక్షణకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆకాశ్ అంబానీ



**తిరుమల ఏప్రిల్ 2 తరంగాలు**
తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆకాశ్ అంబానీకి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆకాశ్ అంబానీ తిరుమలలోని ఎస్వీ గోశాలను సందర్శించారు. అక్కడ గోపూజ చేసి.. గోమాతకు దాణ సమర్పించారు.

# ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా విడుదల

**మళ్లీ టాప్ ప్లేస్ ఎలాన్ మస్క్‌దే..**
**అదానీ, అంబానీలు ఏ స్థానంలో ఉన్నారంటే..?**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 తరంగాలు**
ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025 విడుదలైంది. ఈ జాబితాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తొలిస్థానంలో నిలిచారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్ ప్లేస్ దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ బుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో నిలిచారు.ఇక ఈ జాబితాలో యూఎస్ టాప్‌లో ఉంది. ప్రస్తుతం అమెరికాలో 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా.. భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినతే ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. మరో భారతీయుడు గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు.

# బీసీలు ధర్మ యుద్ధం ప్రకటించాలి

(మొదటి తరువాయి)

వాయిదా వేస్తోందని మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కులగణన చేపట్టామని అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరాగాంధీ దళిత్ కాదని.. కానీ ఆమె అందరికీ భూములు ఇచ్చారని.. ఇళ్లు కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ రాష్ట్రంలో చేయమని మేము అడగలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని సిఎం రేవంత్ అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు– 'అయిననూ హస్తిన పోయి రావలె'.. అన్నట్లు ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నాను' అని రేవంత్ అన్నారు. రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారన్నారు. ట్రిపుల్ తలాఖ్ తెచ్చారని.. ఆర్టికల్ 370 రద్దు చేశారని... వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చిందని ప్రశ్నించారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారని.. 'మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ గర్జన మహా ధర్నాకు వివిధ పార్టీల ఎంపీలు మద్దు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, డీఎంకే కనిమొళి, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే మహాధర్నాకు మద్దతు ఇస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అలాగే ఈ ధర్నాకు ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బిర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, విహెచ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ హాజరయ్యారు.

# 400 ఎకరాల్లో చెట్ల నరికివేత చేపట్టొద్దు

(మొదటి తరువాయి)

సీనియర్ కౌన్సిల్ రవిచంద్.. తన వాదనలు వినిపించారు. జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ వాదనలు జరిగాయి. వట ఫౌండేషన్ తరఫున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా టీజీఐఐసీకి భూములు అప్పగించారని తెలిపారు. ఈ భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ భూమిని జాతీయ ఉద్యానవనంగా గుర్తించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. 2003లో 400 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకడమిక్ భారత్‌కు విక్రయించారని వివరించారు. అంటే.. 5-8-2003లో నాడు ఎకరా భూమిని రూ. 50 వేలకు విక్రయించారని తెలిపారు. ఆ సమయంలో ఒక ఎకరం భూమి రూ. 26 లక్షలు విలువ ఉంటే.. కేవలం రూ. 50 వేలకు విక్రయించారని హైకోర్టు దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు. ఇక 2006లో ప్రభుత్వం మారగానే ఈ భూముల విక్రయం.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. నాటి నుంచి ఐఎంజీ భారత్ కోర్టులో ఈ భూమి కోసం పోరాడుతుందని గుర్తు చేశారు. ఐఎంజీ కేసులో ఇప్పటి వరకు ఈ భూమి ఫారెస్ట్ ఏరియా అని ఒక్క వాదన కూడా జరగలేదని..ఈ విషయాన్ని గమనించాలని హైకోర్టును ఆయన కోరారు. అలాగే ఈ భూమి ఎక్కడా ఫారెస్ట్ ఏరియాగా ప్రభుత్వం నోటిఫై చేయలేదన్నారు. ఇక గూగుల్ మ్యాప్‌లో మాన్సన్ ఏరియా బట్టీ- ఫారెస్ట్ ఏరియాగా కనిపిస్తుందని కోర్టుకు తెలిపారు. ఇది కేవలం ఇండస్ట్రీ భూమి మాత్రమేనని.. ఇది ఫారెస్ట్ ఏరియా మాత్రం కానే కాదని ఆయన వివరించారు. ఇక్కడ హెలిప్యాడ్‌లు సైతం నిర్మించారని గుర్తు చేశారు. డిఫెన్స్ మినిస్టర్ వచ్చినా ఇక్కడే హెలికాప్టర్ ల్యాండ్ అవుతుందని కోర్టుకు ఆయన విన్నవించారు. ఈ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఈ కేసును విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వరకు ఆ భూమిలో ఎటువంటి చెట్లు నరకవద్దని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

(మొదటి తరువాయి)



హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## తెలంగాణలో ఎల్ఆర్ఎస్

# గడువు పెంపు

(మొదటి తరువాయి)

అలాగే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీ–ల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 15.27 లక్షలు వచ్చాయి. వాటిలో 15,894 దరఖాస్తులను ప్రభుత్వాధికారులు తిరస్కరించారు. ఇక ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 6. 87లక్షలు కాగా.. ఎల్ఆర్ఎస్ ఫీజు రూ. 8.65 లక్షలు పెండింగ్‌లో ఉంది. వీటితో పాటు– ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు 2.6 లక్షలు కాగా.. వాటికి సంబంధించి ప్రోసీడింగ్ ఇచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 58, 032 ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ వివరాలను వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందు పరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు.. బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది. అలాగే ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటు–లోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్ సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. అలాగే వెబ్ సైట్ పోర్టల్‌లోని అంశాలపై ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అదీకాక ఎల్ఆర్ఎస్ గడవు సమీపిస్తున్నా.. ప్రభుత్వం ఎటు–వంటి చర్యలు తీసుకోలేదంటూ పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. అలాంటి వేళ.. ఎల్ఆర్ఎస్ ఫీజు గడువును మరో నెల రోజులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసింది.

# ఆంధ్రలో తొలి బర్డ్‌ఫ్లూ మరణం

(మొదటి తరువాయి)

చిన్నారిని జాయిన్ చేశారు. చిన్నారి మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. అయితే, చికిత్స అందించే సమయంలో చిన్నారి గొంతు, ముక్కు నుంచి స్వాబ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. నివేదిక అనుమానంగా రావడంతో పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్ కు శాంపిల్స్ పంపారు వైద్యులు. అయితే, చిన్నారికి హెచ్5 ఎన్1 వైరస్ గా నిర్ధారణ అయింది. బర్డ్ ఫ్లూ మృతిగా తేలడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూ తో మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యుల నుంచి శ్వాబ్ శాంపిల్స్ డాక్టర్లు సేకరించారు. ముందు జాగ్రత్తగా మరిన్ని వైద్య పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకున్నారు. శ్వాబ్ శాంపిల్స్ ను ఎయిమ్స్, పూణే వైరాలజీ ల్యాబ్ కు అధికారులు పంపనున్నారు. చుట్టుపక్కల ఎవరూ జ్వరంతో బాధపడడం లేదని గుర్తించారు. చిన్నారి కుటు–ంబం నివాసం ఉండే ఇంటికి కిలోమీటరు దూరంలో మాంసం దుకాణం నిర్వహిస్తున్నట్లు– వైద్యాధికారులు గుర్తించారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మార్చ్ 4న పాపకి జ్వరం రావడంతో నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాం.. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళగిరి ఎయిమ్స్ లో జాయిన్ చేశారు.. 10 రోజుల చికిత్స తర్వాత పాప చనిపోవడం జరిగింది.. వైద్యులకు అనుమానం వచ్చి పూణే ల్యాబ్ కి రక్త నమూనాలు పంపించారు. నిన్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇంటికి వచ్చి మీ పాప బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోయింది అని చిన్నారి పెద్దనాన్న చెప్పారు.

# ఆస్తుల పరిరక్షణకే వక్ఫ్ చట్టం సవరణ

(మొదటి తరువాయి)

కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకుని రాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా

పేర్కొంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతిచ్చేవారు, వ్యతిరేకించే వారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి.

# శాంతి చర్చలకు మేము సిద్ధం

(మొదటి తరువాయి)

సిద్ధమని మావోయిస్ట్ కేంద్ర కమిటీ సంచలన ప్రకటన చేసింది. 'ప్రజల కోసం ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలి. యాంటీ మావోయిస్టు ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి. ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో జరుపుతున్న హత్యాకాండను ఆపాలి' అని మావోయిస్టు కేంద్ర కమిటీ కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొంది. శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల వాతావరణం కల్పించాలి. అప్పుడు మేం వెంటనే కాల్పుల విరమణ పాటిస్తాం" అని మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభరు పేరుతో లేఖ విడుదలైంది. దీనికి కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# పలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 2 తరంగాలు

మధ్య మహారాష్ట్ర దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. మధ్య మహారాష్ట్ర దాని సమీప ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరీన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9 ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. ఇవాళ(బుధవారం) రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురవనుండగా.. వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు వాతావరణ శాఖ అధికారులు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలోని కొన్ని జిల్లాలలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

# తక్కువ కాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత

(మొదటి తరువాయి)

మాట్లాడుతూ హైదరాబాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా 400 ఎకరాల భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని ఆమె పేర్కొన్నారు. ఆ భూముల పరిరక్షణ కోసం కేసీఆర్ నిర్దేశం మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారన్నారు. ఇది యూనివర్సిటీ భూమి అని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళవద్దన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందని గుర్తుచేశారు. యూనివర్సిటీ నుంచి తీసుకున్న భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 397 ఎకరాలను ఇతర చోట యూనివర్సిటీకి ఇచ్చామని ప్రభుత్వం వితండవాదం చేస్తుందని మండిపడ్డారు. పరిశ్రమల ఏర్పాటు, భూముల విక్రయం ఆ 397 ఎకరాల్లో చేసుకోవచ్చు కదా..? ప్రభుత్వం పర్యావరణం, ప్రకృతి కోణంలో కూడా ఆలోచించాలి అని కవిత సూచించారు. ఇప్పటికే కాంక్రీట్ జంగిల్ లాగా మారిన గచ్చిబౌలి ప్రాంతంలో ఈ 400 ఎకరాల్లో కూడా పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటు అయితే వాతావరణంపై ఎంత ఒత్తిడి పెరుగుతుందో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో మై హోమ్ విహంగ నిర్మాణానికి భూములు కేటాయించామనడంలో వాస్తవం లేదన్నారు. మై హోమ్ విహంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లయితే సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లను పంపించాలని అన్నారు.

# పేదలందరికీ సన్నబియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**-దేశంలోనే సన్న బియ్యం అందిస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ**

**-వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య**

**వర్ధన్నపేట ప్రతినిధి,02ఏప్రిల్,తరంగాలు:** పేదలందరికీ సన్నబియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య అన్నారు.వర్ధన్నపేట మండల పరిధిలోని కట్ర్యాల గ్రామంలో బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఇంటికి సన్నబియ్యం చేరాలన్న గొప్ప సంకల్పంతో చారిత్రాత్మక పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని,ఉగాది,రంజాన్ పండుగల శుభ సందర్భంగా దారిద్ర్య రేఖకు దిగువనున్న పేదవారికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న గొప్ప ఆలోచనతో సన్నబియ్యం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.రాష్ట్రంలోని 2కోట్ల



61లక్షల మందికి పేదలకు తలకు ఆరు కిలోల సన్నబియ్యం అందజేస్తున్నామని తెలిపారు.అందుకు 10600 కోట్లు కేటాయించింది అయినప్పటికీ ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కట్ర్యాల గ్రామ పంచాయితీ కార్యదర్శి బుస్స శ్రీనివాస్,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు,సహృదయ అనాధ వృద్ధ ఆశ్రమం నిర్వాహకులు మహమ్మద్ చోటే బాయ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు,కట్ర్యాల ఇందిరమ్మ కమిటీ మెంబర్ నాపెల్లి రవీందర్,జిల్లా నాయకులు శ్రీపాది సతీష్,వర్ధన్నపేట కాంగ్రెస్ మండల మైనార్టీ అధ్యక్షులు,ఇందిరమ్మ కమిటీ మెంబర్ మహమ్మద్ అక్బర్,వర్ధన్నపేట మండల నాయకురాలు,కట్ర్యాల ఇందిరమ్మ కమిటీ మెంబర్ తీగల సునీత,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసి సెల్ కార్యదర్శి గజ్జల సదయ్య,కట్ర్యాల ఇందిరమ్మ కమిటీ మెంబర్ తాటికాయల కుమార్,కాంగ్రెస్ నాయకులు శ్రీపాది హరికృష్ణ,ఎలికట్టే రాజు,కట్ర్యాల కారోబార్ తాటికాయల రమేష్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కడుపునింపే ప్రభుత్వం

**-డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి**

**కేసముద్రం, ఏప్రిల్ 02, (తరంగాలు)** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమాన్ని కేసముద్రం సింగిల్ విండో వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ పేద ప్రజలకు అండగా నిలబడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ ఇచ్చి ఖరీదు చేసిన వరి ధాన్యాన్ని తిరిగి రాష్ట్ర ప్రభుత్వం వాటిని బియ్యంగా మార్చి పేద ప్రజల కుటుంబాలలో పండుగ వాతావరణం ఎల్లప్పుడూ ఉండాలని ఉద్దేశంతో పేదల కడుపు నిండా భోజనం చేయాలనే సదుద్దేశంతోనే ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. గతంలో దొడ్డు బియ్యం గత ప్రభుత్వం ఇస్తే వాటిని తినకుండా పేద ప్రజలు విక్రయించడం వలన దళారులే లక్షాధికారులైనటువంటి పరిస్థితి నుండి




ఈరోజు పేద ప్రజలు తినే విధంగా సన్నబియాని ఇస్తుంది కాబట్టి దీన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అమీనాపురం గ్రామంలో గత నాలుగు ఐదు సంవత్సరముల నుండి డీలర్ వ్యవస్థ చిన్నాభిన్నమై అమీనాపురం ప్రజలందరూ పక్క గ్రామాలలో బియ్యం తీసుకొస్తూ అనేక ఇబ్బందులకు గురి అయిన విషయాన్ని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ దృష్టికి తీసుకువెళ్లాననీ ఆ సమస్యను పరిష్కరించి గ్రామంలోనే బియ్యం అందరూ తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

# సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన తహసీల్దార్ విజయ్ సాగర్

**వర్ధన్నపేట ప్రతినిధి,02ఏప్రిల్,తరంగాలు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్ ప్రారంభించారు. బుధవారం వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామంలోని 11,12 చౌక ధరల దుకాణంలలో జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం ద్వారా పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభోత్సవానికి తహసీల్దార్ విజయ్ సాగర్ ముఖ్య అతిధిగా హాజరై బియ్యం పంపిణీ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి ప్రభుత్వం ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. ప్రతి నిరుపేదలకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశ్యం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ,సీనియర్ నాయకులు పోశాల వెంకన్న



గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షులు చీరబోయిన రాజు, నాయకులు మెరుగు రమేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు తీగల రాకేష్ యాదవ్,గ్రామ అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గురువాయి గూడెం రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ...



**పాలేరు ఆర్సీ 02 ఎప్రిల్ ( తరంగాలు).** కూసుమంచి మండలంలోని గురువాయిగూడెం గ్రామంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆ గ్రామంలో లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి ,రమేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఎడవల్లి ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ బానోతు సత్యం, స్థానిక డీలర్ బానోతు బుజ్జి గ్రామ పెద్దలు లబ్ధిదారులు తదితరులు. పాల్గొన్నారు....

## సర్దార్ సర్వాయి పాపన్న ఉద్యమస్ఫూర్తిని కొనసాగిస్తాం

**గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతి**



**వర్ధన్నపేట ప్రతినిధి,02ఏప్రిల్,తరంగాలు:** బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న ఉద్యమస్ఫూర్తిని కొనసాగిస్తామని జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్,సొసైటీ అధ్యక్షుడు సమ్మెట సూరి గౌడ్, ఉపాధ్యక్షుడు సట్ల సూరి గౌడ్ లు కొనియాడారు. బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న 315 వ వర్ధంతి సందర్భంగా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని కంఠమహేశ్వర ఆలయం ఎదుట గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్,సొసైటీ అధ్యక్షుడు సమ్మెట సూరి గౌడ్, ఉపాధ్యక్షుడు సట్ల సూరి గౌడ్ లు సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ గౌడ జాతి ముద్దు బిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని,గోల్కొండ కోటపై బడుగుల జెండా ఎగురవేసిన బహుజనుల ముద్దుబిడ్డ అని కొనియాడారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు సట్ల నర్సింహులు,సాయిలు, కత్తి వేణు,సట్ల సమ్మయ్య,పెద్దగోని కవిరాజు, తాల్లపెల్లి గోపి,శ్రీనివాస్,సట్ల లక్ష్మినారాయణ, పెద్దగోని కోటి,సమ్మెట రాజు,బూడిది రమేష్,గడ్డం సతీష్,తదితరులు పాల్గొన్నారు.

## డబ్ల్యూజేఐ ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించిన బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ ప్రతినిధి ,02ఏప్రిల్,తరంగాలు:** వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) రూపొందించిన శ్రీ విశ్వా వసు నామ సంవత్సర ఉగాది పంచాంగం/డైనందినిని డబ్ల్యూజేఐ ఉగాది పంచాంగాన్ని వరంగల్ బీజేపీ సీనియర్ నాయకులు,జాతీయ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆవిష్కరించారు.బుధవారం వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ ) రూపొందించిన శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగం/డైనందినిని ఓ సిటీ లోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు నివాసంలో ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ పాత్రికేయులకు,తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.డబ్ల్యూజేఐ కృషిని అభినందించారు.డబ్ల్యూజేఐ చేపట్టే అన్ని కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.పాత్రికేయులకు,పంచాంగం/డైనందిని ఆవిష్కరణ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ తెలంగాణ రాష్ట్ర సెక్రటరీ ఎన్.ఎస్. రావు,వరంగల్ జిల్లా కన్వీనర్ పులి శరత్ కుమార్,యంసాని శ్రీనివాస్,యామ్స్ పెన్ అసోసియేట్ ఎడిటర్ కొత్తపల్లి రమేష్,భూక్యా సిద్దు నాయక్,ప్రదీప్ నాయక్,బీజేపీ నాయకులు రాజేశ్వర్ రావు,పీఆర్ఓ వినయ్ పటేల్,పీఏ సంపత్,రాజందర్,బీ సతీష్ గౌడ్,ఏ రాధాకృష్ణ,చింతపట్ల సాయి కుమార్,గోపాల్ రావు,శోభారాణి,రమేష్ కాందాల,రడపాక ప్రదీప్, షణ్ముఖ చారీ,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనిధి ఇన్స్టిట్యూట్ విద్యార్థుల ఘన విజయాలు






**కేసముద్రం, ఏప్రిల్ 02, (తరంగాలు)**
కేసముద్రంలోని శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు ఘన విజయాలను సాధించి, సంస్థ ఖ్యాతిని మరో మెట్టుపైకి తీసుకెళ్లారు. సంస్థ డైరెక్టర్ చెవ్వ వెంకటేష్ నేతృత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు తెలంగాణలో ప్రాముఖ్యత కలిగిన ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించారు. ఈ ఏడాది జరిగిన పరీక్షల్లో శ్రీనిధి ఇన్స్టిట్యూట్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో సీట్లు సాధించడమే కాకుండా వరంగల్ జిల్లాలో మొదటి,రెండో స్థానాలను కైవసం చేసుకున్నారు. ఇదే కాకుండా,విటిజిసెట్ ప్రవేశ పరీక్షలో వరంగల్ జిల్లా ప్రథమ ర్యాంక్,మహబూబాబాద్ జిల్లా ద్వితీయ ర్యాంక్ గెలుచుకున్నారు. అంతేగాక, శ్రీనిధి ఇన్స్టిట్యూట్ కు చెందిన విద్యార్థులంతా విటిజిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడం గర్వించదగిన విషయం. ఈ విజయాలపై డైరెక్టర్ చెవ్వ వెంకటేష్ మాట్లాడుతూ, మా విద్యార్థుల కృషికి ఇది ప్రతిఫలంగా మారింది. మా సంస్థ విద్యార్థులకు ఉత్తమ శిక్షణను అందిస్తోంది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షిస్తున్నాము అని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు విజేతలను అభినందిస్తున్నారు. శ్రీనిధి ఇన్స్టిట్యూట్ విద్యార్థుల ఈ ఘనత భవిష్యత్తులో మరిన్ని విజయాలకు దారితీసేలా ఉండాలని ఆశిద్దాం.

# పేదల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం





-దేశంలోనే తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ
-ఇది ప్రజా ప్రభుత్వం-పేద ప్రజల మేలు కోరే ప్రభుత్వం
-వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**మామునూరు,02ఏప్రిల్,తరంగాలు:**
కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అను నిత్యం పేద ప్రజల సంక్షేమం కోసమే ఆలోచిస్తుందని,అందుకే వారి ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారని వర్ధన్నపేట కేఆర్ నాగరాజు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43,44వ డివిజన్ పరిధిలోని మామునూరు,తిమ్మాపూర్,పెన్షన్ పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సన్నబియ్యం పంపిణీ పథకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాగరాజు పాల్గొని పేదలకు బియ్యం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. శ్రీమంతుల తరహాలో పేదలు కూడా సన్నబియ్యం తినాలనే ఆలోచనతో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈ ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం చరిత్రలో నిలిచి పోతుందని రాబోయే రోజుల్లో ఏ ముఖ్యమంత్రి అయినా ఈ పథకాన్ని కొనసాగించాల్సిందేనని తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 2,70,148 మంది ప్రజలకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నట్టు స్పష్టం చేశారు.సోనియాగాంధీ ఆహార భద్రత చట్టం తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేసారని,పేదలకు కడుపు నిండా అన్నం పెట్టేందుకు ఈ పథకం తేవడం జరిగిందని చెప్పారు.ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేసే కార్యకమం చేపట్టామని తెలిపారు.ఇంత గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్క,కొండా సురేఖ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అరుణ విక్టర్,నాయకులు చింత ప్రకాష్,రాజు,మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు,డివిజన్ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన కార్యక్రమాలతో ఆటిజంను నివారించవచ్చు

**అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి**







**హనుమకొండ ప్రతినిధి,02ఏప్రిల్,తరంగాలు:**
అవగాహన కార్యక్రమాలతో ఆటిజంను నివారించవచ్చని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్,కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.బుధవారం ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ఆటిస్టిక్ వ్యక్తుల గురించి అవగాహన కల్పించడానికి హనుమకొండలోని మల్లికాంబ మనో వికాస కేంద్రం ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్ లో ఆటిజం పిల్లల పట్ల గౌరవంతో ఉండాలని,వారితో ప్రేమగా ఉండాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యురాలు,వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ ఛైర్మన్ డాక్టర్ కరుకాల అనితా రెడ్డి పాల్గొని మాట్లాడారు.వయస్సుకు తగ్గ ఎదుగుదల లేకుండా పుట్టిన పిల్లలను ఆటిజం పిల్లలుగా గుర్తిస్తారని అన్నారు.ప్రస్తుత కాలంలో గర్భం దాల్చిన సమయంలో అధిక ఒత్తిడితో ఉండటం,దగ్గర సంబంధాలు చేసుకోవడం,మానసిక ఎదుగుదల లోపాల కారణంగా చాలా మంది పిల్లలు మేధో సంబంధ సమస్యలకు గురవుతున్నారు అందులో ఒకటి ఆటిజం అన్నారు.పిల్లలకు ఆటిజం సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వారికి కొన్ని ముందస్తు చర్యల ద్వారా వారిలో సామాజిక నైపుణ్యాలు మెరుగుపరిచి మార్పు తీసికొని రావచ్చునని, అందుకు కృషి చేయవచ్చన్నారు.వైద్యుల సలహా మేరకు ఆటిజం చికిత్స తీసుకుంటూ వారికి ప్రత్యేక శిక్షణ ద్వారా పిల్లలలో మార్పు తీసుకొని రావచ్చునని,వైద్యులు దీని పట్ల అవగాహన కల్పించాలని అన్నారు.ఈ అవగాహన కల్పించడానికి ముందుకు వచ్చిన మల్లికాంబ మనో వికాస కేంద్రం వారిని డాక్టర్ అనితా రెడ్డి అభినందించారు, సమిష్టి కృషితో ఈ ఆటీజంను నివారించవచ్చన్నారు.తదుపరి మల్లికాంబ సంస్థ వ్యవస్థాపకురాలు బండ రామలీల మాట్లాడుతూ వయస్సుకు తగిన పరిపక్వత లేక పోవడాన్ని మనం ఆటిజంగా గుర్తించవచ్చు దీనికి శిక్షణ ఒక్కటే మార్గం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కోడం కళ్యాణ్,సిబ్బంది,పిల్లలు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.

# హెచ్.సి.యు భూములను కాపాడండి

**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**బీఆర్ఎస్ ప్రముఖులతో కలిసి కేంద్ర మంత్రి ధర్మేంద్ర కు విజ్ఞప్తి**



**ఢిల్లీ,02ఏప్రిల్,తరంగాలు:**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయు)భూములను వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను వెంటనే నిలువరించాల్సిందిగా బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్.సురేష్ రెడ్డి,వద్దిరాజు రవిచంద్ర,దీవరకొండ దామోదర్ రావులు కేంద్ర విద్యా,నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు విజ్ఞప్తి చేశారు.బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ సురేష్ రెడ్డి,డిప్యూటీ లీడర్ రవిచంద్ర,విప్ దామోదర్ రావులు బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో భేటీ అయ్యారు.హైదరాబాద్ గచ్చిబౌలిలో నెలకొన్న సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములలో 400 ఎకరాలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఎంపీలు మంత్రికి వివరించారు. ఈ భూములలో చెరువులు,కుంటలతో పాటు అరుదైన వృక్ష జాతులు,జింకలు,నెమళ్లు, సరీసృపాలతో జీవ వైవిధ్యం నెలకొని ఉందని, పరిసర ప్రాంతాల వారికి స్వచ్ఛమైన సహజవాయువు దొరుకుతున్నదన్నారు.ఎంతో విలువైన,తమ యూనివర్సిటీ భవిష్యత్తు అవసరాలకు గాను ఉన్న ఈ భూములను వేలం వేయకుండా నిలువరించాలని కోరుతూ విద్యార్థులు, మేధావులు ఆందోళన బాట పట్టిన విషయాన్ని ఎంపీలు సురేష్ రెడ్డి,రవిచంద్ర,దామోదర్ రావులు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి తెచ్చారు.మంత్రి వెంటనే స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎంపీలకు హామీనిచ్చారు.ఈ సందర్భంగా ఎంపీల వెంట రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్,బీఆర్ఎస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్,తుంగబాలు,సెంట్రల్,ఉస్మానియా యూనివర్సిటీలకు చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఉన్నారు.

## రాజాపేట శివాలయం వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని శివాలయం వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ప్రభుత్వ విప్ మాజీ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి. వారికి ఆలయ పూజారి చంద్రశేఖర్ వేద ఆశీర్వాదం ఇచ్చి అభిషేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు నిర్వాహకులు సునీత మహేందర్ రెడ్డికి సన్మానం చేసి దేవుని ప్రతిమ గల ఫోటోలు బహుకరించడం జరిగినది.ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ వారు మాట్లాడుతూ ఆలయ పునర్ నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేసిన గొంగిడి దంపతులకు వారు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలుపడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, జలసాధన సమితి మండల నాయకులు ఎర్ర గోకుల జస్వంత్, కోరుకొప్పుల వెంకటేష్ గౌడ్ , మేక వెంకటేశ్వర రెడ్డి, గోపగాని యాదగిరి గౌడ్ , ఠాకూర్ ధర్మేందర్ సింగ్, రెడ్డబోయిన రాజు,చెరుకు కనకయ్య, వరిమడ్ల బాలకృష్ణ, గంధ మల్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం హేచ్చీయూ భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం**




**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):**
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో బుధవారం రోజు అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం హేచ్చీయూ భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిరసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్,బిజెపి నాయకులు, బీజేవైఎం నాయకులు పాల్గొనడం జరిగింది.

# పేదల సంక్షేమం కోసమే సన్నబియ్యం పంపిణీ



-వర్దన్నపేటలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు



**వర్దన్నపేట ప్రతినిధి,02ఏప్రిల్,తరంగాలు:** పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని వర్దన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్దన్నపేట పట్టణంలోని 25,28,29,32 రేషన్ షాపులలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాంలో ఆహారభద్ర చట్టాన్ని తీసుకువచ్చి పేదల ఆకలి తీర్చే ప్రయత్నం చేశామన్నారు.సన్న బియ్యం పథకమును తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి,మంత్రివర్గానికి వర్దన్నపేట నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరూపరుస్తూ గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుతూ,పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తున్నాయని,ఎన్నికలు వచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. 6 గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని, ఇప్పటికే సన్న వడ్లకు 500 రూ బోనస్,రైతు రుణమాఫీ,మహాలక్ష్మి పథకం,ఉచిత బస్సు ప్రయాణం,మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇల్లు,రేషన్ కార్డులు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో భారీ అప్పులు చేసిందని,పేదల కడుపు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ సాగర్,మున్సిపల్ కమిషనర్ ఇమ్మడి సుదీర్ కుమార్,టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ,కాంగ్రెస్ పార్టీ వర్దన్నపేట పట్టణ అధ్యక్షులు మైస సురేష్ కుమార్,మాజీ కౌన్సిలర్లు సమ్మెట సుదీర్ గౌడ్,తుమ్మల రవీందర్,మంచాల రామకృష్ణ,మహిళా నాయకులు కర్ర మాలతి రెడ్డి, తొర్రి పద్మ,ఇల్లందుల ఎలీషా,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆహార భద్రకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు



**కేసముద్రం, ఏప్రిల్ 02,( తరంగాలు)** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్న బియ్యం పథకాన్నీ ధన్నసరి సింగిల్ విండో బ్యాంక్ వైస్ చైర్మన్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు ప్రారంభించారు.అంనతరం నాగేశ్వర్ రావు మాట్లాడుతూ భారతదేశంలో ఇటువంటి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.ఉగాది నాడు హుజూర్ నగర్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ,మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి ప్రారంబించారని అన్నారు.శ్రీమంతులే కాదు పేదలు కూడా సన్న బియ్యం తినాలన్నది ప్రజా ప్రభుత్వం ఆకాంక్ష.పేదలకు ఆహార భద్రత కల్పించడానికి కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందని అన్నారు.బియ్యం పంపిణీలో ఇలాంటి ఒక అవకతవకలు జరగకుండా ప్రతిఒక్క లబ్ధిదారునికి చేరాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ముఖ్యమంతి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి కి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, ఎమ్మెల్యే మురళి నాయక్ కి, ఎంపీ బలరాం నాయక్ లకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి,మర్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ అయబ్ ఖాన్,యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గణేష్, బానోత్ బలు,తరాల సుధాకర్,రషీద్ ఖాన్, ఎండీ నవాజ్ అహ్మద్,వెలిశాల కమల్, ఎలేందర్,తోట సుధాకర్,గొట్టం రమేష్,బానోత్ నరేష్,పిల్లి రమేష్,తోట అఖిల్,పోలేపాక శంకర్, హరి కృష్ణ,ఎండీ సమీర్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులలో సీఎం ఫోటోతో పాటుగా ప్రధాని ఫోటో కూడా పెట్టాలని తహసీల్దార్ కి మెమోరాండం

అందచేసిన మండల బిజెపి నాయకులు



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో బుధవారం రోజున భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కి మెమోరండం ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుంది. అందులో ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం 5 కిలోలు రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో బియ్యాన్ని ఇవ్వడం జరుగుతుంది. ప్రతి రేషన్ షాప్ లో ఓపెనింగ్ రోజు ఫ్లెక్సీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటో వేయాలని బిజెపి మండల శాఖ నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, భూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, యాస వెంకట్ రెడ్డి, బీజేవైఎం నాయకులు మజ్జిగ నరేష్, బొజ్జే పవన్ ,బిజెపి నాయకులు గ్రామ శాఖ ఉపాధ్యక్షులు శబ్బ పీస్ నరసింహారావు, గడ్డం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు గౌడ సంఘం భవనంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో బహుజన వీరుడు శ్రీశ్రీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 315 వ వర్ధంతి సందర్భంగా బుధవారం రోజు బీజేపీ పార్టీ ఓబీసీ పట్టణ అధ్యక్షులు ఎగ్గిడి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ కి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో బిజెపి ఆలేరు పట్టణ అధ్యక్షుడు నంద గంగేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు జహంగీర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కంతుల శంకర్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కామటికారి కృష్ణ, టౌన్ ప్రధాన కార్యదర్శి కల్లెం రాజు గౌడ్, బైరి మహేందర్ గౌడ్, సృజన్ గౌడ్, ఎలుగల వెంకటేష్,యువ మోర్చ నాయకులు జన్నె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కనీవిని ఎరుగని రీతిలో బిఆర్ఎస్ రజతోత్సవ సభ



-రజతోత్సవ మహాసభ ప్రారంభ పనుల అంకురార్పణలో ఎర్రబెల్లి

**ఎల్కతుర్తి,02ఏప్రిల్,తరంగాలు:** భారత రాష్ట్ర సమితి పార్టీ 25 ఏండ్ల పండుగను (రజతోత్సవం) ఈ నెల 27 న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న సందర్భంగా ఈ రజతోత్సవ మహాసభ ప్రారంభ పనుల అంకురార్పణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభా 27 వ తారీఖున దేశం మొత్తంలోనే ఏ రాష్ట్రంలో చెయ్యని రీతిగా అతి పెద్ద సభా ఇక్కడ జరగబోతుందన్నారు.నాటికి బిఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 ఏళ్ల అయిన సందర్భంగా అసలు ఈ పార్టీ ఎందుకోసం పుట్టింది, ఉద్యమ సమయంలో ఎంతమంది ఉద్యమకారులు అమరులయ్యారు, తెలంగాణ ధ్యేయంగా రాష్ట్రాన్ని సాధించుకున్న తీరు,ఆ తర్వాత ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ ధ్యేయంగా ముందుకు సాగిన తీరు మరోసారి గుర్తు చేసుకుంటూ,నాడు కెసిఆర్ పాలనలో సాగునీరు, త్రాగునీరు, కరెంట్ కు ఎలాంటి కష్టం లేకుండా ఉన్న ప్రజలు నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అరిగోసలు పడుతున్న తీరు చూస్తూనే ఉన్నామన్నారు. తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారని, కెసిఆర్ ను ఎందుకు పోగొట్టుకున్నామనే బాధ ప్రజల్లో బలంగా ఉందని, మరోసారి కేసీఆర్ ను ముఖ్యమంత్రిని చేసే దిశగా కార్యకర్తలు అందరు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ఈ రజతోత్సవ సభ ఉమ్మడి వరంగల్ లో జరగడం మనందరం సంతోషించాల్సిన విషయమని,ప్రతి ఒక్క కార్యకర్త ఈ సభ విజయవంతం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.మరి ముఖ్యంగా హనుమకొండ,ఎల్కతుర్తి ప్రజలు ఈ సభ జరిగే రోజున అవసరమైతేనే తప్ప రోడ్లపైకి రాకూడదని కొద్దిగా ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా మనవి చేశారు.

# గచ్చిబౌలి భూములపై బీజేపీ,బీఆర్ఎస్ రాద్ధాంతం తగదు

**-టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్**



**హైదరాబాద్,02ఏప్రిల్,తరంగాలు:** హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలో400 ఎకరాల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుల్లో కొట్లాడి సాధించిందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ స్పష్టం చేశారు.ఈ విషయంలో బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల నాయకులు అవి హెచ్.సి.యూ. భూములు అని రాద్ధాంతం చేయడం వారి అవగాహనారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వాస్తవానికి ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 2003లో ఐఎంజీ అకాడమీస్ సంస్థకు కేటాయించారు.ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఐఎంజీ అకాడమీస్ సంస్థకు భూమిని కేటాయించిన ఉత్తర్వులను రద్దు చేసి,2006 నవంబరులో ఏపీ యూత్ అడ్వాన్స్ మెంట్ టూరిజం,కల్చరల్ డిపార్టుమెంటుకు కేటాయించడం జరిగింది.అయితే, తమకు కేటాయించిన భూమి బదలాయింపు రద్దుపై ఐఎంజీ అకాడమీస్ సంస్థ 2006లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.అందులో ప్రతివాదులుగా న్యాయ,శాసన వ్యవహారాలశాఖ,యూత్,టూరిజం, కల్చరల్ డిపార్టుమెంట్,క్రీడాశాఖ వీసీ, ఎండీతోపాటు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్,శేరిలింగంపల్లి తహసీల్దార్,పైన అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలను చేర్చడం జరిగింది.ఈరోజు బీజేపీ,బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నట్లుగా ఆ భూములు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీవి అయితే హెచ్.సి.యూ అధికారులను కూడా కేసులో ప్రతివాదులుగా చేర్చేవారు కదా? దీన్నిబట్టి ఈ భూములు సెంట్రల్ యూనివర్సిటీవి కావని స్పష్టమవుతుందని వివరించారు.వాస్తవాలు ఇలా ఉంటే రాజకీయ కుట్రలు చేస్తూ,ప్రసార మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు చూస్తూ విద్యార్థులను రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. ఐఎంజీ అకాడమీస్ సంస్థకు వ్యతిరేకంగా 2004లో హైకోర్టులో తీర్పు రావడంతో రావడంతో,ఆ సంస్థ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ 9265/2024 ద్వారా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు కూడా ఈ భూములు ప్రభుత్వానివేనని తీర్పునివ్వడంతో సుదీర్ఘ పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వ వాదనను బలంగా వినిపించి అన్యాయం కానున్న భూములను రేవంత్ సర్కారు కాపాడిందన్నారు.ఇది చూసి ఓర్వలేని కుహనా బీజేపీ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలతో అమాయక విద్యార్థులను రెచ్చగొడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని బండి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. ఎవరు అవునన్నా, కాదన్నా.. కంచ గచ్చిబౌలి ప్రభుత్వ భూముల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐటీ అభివృద్ధి చేసి తీరుతుందన్నారు. వాస్తవాలను వక్రీకరించి,తప్పుడు ప్రచారాలతో విద్యార్థులను రెచ్చగొట్టే బీజేపీ,బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన,న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# బిఆర్ఎస్ నాయకులు ఆకుల ముత్యంగౌడ్ కన్నుమూత

**-ముత్యంగౌడ్ మరణం బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు ఆలేరు తాజామాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి**



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం ఉప్పలపహడ్ గ్రామ తాజామాజీ సర్పంచ్ ఆకుల సరిత భర్త ఆకుల ముత్యం గౌడ్ అనారోగ్య కారణంగా మరణించారు. వారి కుటుంబాన్ని ఆలేరు తాజామాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ముత్యం గౌడ్ సేవలు బీఆరెస్ పార్టీ మరువదు అన్నారు. అదేవిధంగా బీఆరెస్ పార్టీ దాతల నుంచి 1,67,000? రూపాయల ఆర్థిక సహాయాన్ని మాజీ ఎమ్మెల్యే అందజేశారు.ఆర్థిక సహాయం అందించిన దాతలు : తాజామాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి రూ,, లు10,000 కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరీదీప్ రెడ్డి 20,000 బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ 10,000 తాజామాజీ కూరెళ్ల సర్పంచ్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య యాదవ్ 10,000మాజీ వైఎస్ ఎంపిపి ఏనుగు దయాకర్ రెడ్డి 10,000 పుల్లాయగూడెం తాజామాజీ సర్పంచ్ పెసరు గిరిజా గోపాల్ రెడ్డి 10,000 పోతిరెడ్డిపల్లి తాజామాజీ సర్పంచ్ గనగాని మాధవి మల్లేశం గౌడ్ 10,000 తాజామాజీ ఖప్రాయపల్లీ సర్పంచ్ సామ వరలక్ష్మి శ్రీనివాసరెడ్డి 10,000 పారుపల్లి తాజామాజీ సర్పంచ్ లగ్గాని రమేష్ గౌడ్ 5000 ఆత్మకూరు(ఎం) తాజామాజీ ఎంపిటిసి యాస కవితా ఇంద్రారెడ్డి 5000 మాజీ సర్పంచ్ రాయిపల్లి పంజాల వెంకటేష్ గౌడ్ 5000 మోర్పిరాల తాజామాజీ సర్పంచ్ సామ తిరుమల్ రెడ్డి 5000 తాజామాజీ కోరటీకల్ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ 5000 తాజామాజీ సర్పంచ్ మోదుగుబావిగూడెం బబ్బూరి రమేష్ గౌడ్ 5000 బీతాజామాజీ సర్పంచ్ సారగండ్లగూడెం కల్వల అంజయ్య 5000 బిఆర్ఎస్ పార్టీ టి రేపాక గ్రామ శాఖ అధ్యక్షులు యాస అంజిరెడ్డి 5000 తాజామాజీ సర్పంచ్ రాఘవాపురం దొండ కమలమ్మ పురుషోత్తం రెడ్డి 5000 పల్లెర్ల తాజామాజీ సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి 5000 తాజామాజీ సర్పంచ్ మోదుగుకుంట మామిడి లలిత మోహన్ రెడ్డి 5000 ఏనుగు రాంరెడ్డి 5000 తాజామాజీ సర్పంచ్ రాయిపల్లి పంజాల సుమతీ శ్రీనివాస్ గౌడ్ 5000 గడ్డమీది రమేష్ గౌడ్ టి రేపాక మాజీ సర్పంచ్ 5000 పిఎస్ గార్డెన్ ఆత్మకూరు(ఎం) యాజమాని పొనగాని జహంగీర్ గౌడ్ 3000 పల్లెపహడ్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాజీ వైస్ ఎంపిపి కాలే మల్లేష్ 2000 రహీంఖాన్ పేట మాజీ సర్పంచ్ మల్లెల పర్వతాలు 2000 అందచేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకంపై మీసేవ కేంద్ర ఆపరేటర్లతో ఆర్డీవో కృష్ణారెడ్డి సమీక్ష సమావేశం






**ఆలేరు ఆర్సీ,ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి పట్టణ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పట్టణానికి సంబంధించిన మీ సేవ కేంద్రాల ఆపరేటర్లతో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) ఎం కృష్ణారెడ్డి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఆన్ లైన్ చేసే విధానంపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డిఓ ఎం కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఈడబ్ల్యుసి సంబంధించిన నిరుద్యోగులకు యువకులకు విద్యార్థులకు ఉపాధి కల్పించడం కోసం వాళ్లను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ప్రతిష్టాపకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు తేదీని ఏప్రిల్ నెల 14 వరకు పొడిగిస్తూ మరియు ప్రభుత్వం ఆన్ లైన్ విధానంలో అనేక మార్పులను తీసుకురావడం జరిగింది. ముఖ్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలను నిరుద్యోగులు యువకులు విద్యార్థులుకు క్లుప్తంగా వివరించాలి. ముఖ్యంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఆన్ లైన్ అప్లై చేసుకోవడం కోసం 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ప్రభుత్వం ఏర్పడినప్పుడు మీసేవ ద్వారా కులం సర్టిఫికేట్ తీసుకున్నట్లయితే అట్టి సర్టిఫికెట్ తోనే ఇప్పుడు రాజీవ్ యువ వికాస పథకం అప్లై చేసుకొనుటకు అర్హులు మరియు ఇన్కమ్ సర్టిఫికెట్ లేని వాళ్లు కూడా ప్రభుత్వం ద్వారా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నవాళ్లు రేషన్ కార్డు నెంబర్ తో రాజీవ్ యువ వికాసం పథకాన్ని అప్లై చేసుకోవడానికి అర్హులని అన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా గత ఐదు సంవత్సరాల క్రితం ఎస్సీ, బీసీ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన వారు ఉన్నట్లు అయితే ప్రభుత్వం రుణం పొందిన రోజు నుండి నేటి వరకు ఐదు సంవత్సరాలు పూర్తి అయినట్లయితే ఈ రాజీవ్ యువ వికాసం పథకానికి అప్లై చేసుకోవడానికి వాళ్ళు కూడా అర్హులని అన్నారు. ముఖ్యంగా మీ సేవ కేంద్రాల ఆపరేటర్లు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన అర్జీదారులకు క్లుప్తంగా వివరించాలని లాభార్జన కోసం మీసేవ కేంద్ర ఆపరేటర్లు పనిచేయవద్దు నిరుద్యోగులను యువకులను ఇబ్బందులకు గురి చేయొద్దని ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను మీసేవ కేంద్రాలలో ఏర్పాటు చేయాలి అన్నారు.

# ఎంపిడిఓ ఆఫీసు ముందు జీపీ ఉద్యోగుల ధర్నా



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం బుధవారం రోజున మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఎంపిడిఓ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులకు ప్రతి నెల ట్రెజరీ ద్వారా ఒకటవ తారీఖున జీతాలు ఇవ్వాలని అని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఓ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని గ్రామ పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**315వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన పల్లెర్ల గౌడ సంఘం నాయకులు**



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం)మండలం పల్లెర్ల గ్రామంలో బుధవారం రోజున బహుజన వీరుడు సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వ వర్ధంతి సందర్భంగా గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న విగ్రహం వద్ద నివాళు లుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన పోరాట యోధుడు, సబ్బండ వర్గాలకు రాజకీయ,సామాజిక సమానత్వం కోసం పాటుపడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ ఆమహనీయుడికి ఇవే మానివాళులు అంటు అర్పించారు. వారి ఆశయ సాధనకై అడుగులు వేస్తూ వారి పోరాట స్పూర్తితో ముందుకు వెళ్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు నోముల లక్షమయ్య గౌడ్, ఉపాఅధ్యక్షులు లోడి శ్రీహరి గౌడ్ , కార్యదర్శి నోముల కిష్టయ్య గౌడ్, పెదగాని వెంకన్న గౌడ్, లోడి నాగరాజు గాడ్, నోముల శేఖర్ గౌడ్, నోముల దేవయ్య గౌడ్, లోడి వెంకన్న గౌడ్, తండ మచ్చగిరి గౌడ్, గౌడ్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ తెల్ల రేషన్ కార్డుదారులకు వరం

**పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం**

**వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం**



**వర్ధన్నపేట ప్రతినిధి,02ఏప్రిల్, తరంగాలు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయం తెల్ల రేషన్ కార్డుదారులకు ఒక వరమని వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం అన్నారు. వర్దన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు బుధవారం ల్యాబర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందజేయడం జరుగుతుందన్నారు.దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.సన్న బియ్యం పంపిణీ పేదలకు వరం అని మహిళలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ల్యాబర్తి గ్రామపంచాయతీలోని రేషన్ షాప్ లో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి లో పాల్గొన్న హరిశంకర్ గౌడ్





**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలోని భువనగిరి ఖిల వద్ద ఉన్న బహుజన ర్యాజధికార ప్రతిక, తొలి తెలుగు చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ బీసీ పొలిటికల్ జె.ఎ.సి కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న ట్రస్ట్ చైర్మన్ పంజాల జైహింద్ గౌడ్ , మాజీ ఎంపిపి అతికం లక్ష్మీనారాయణ గౌడ్ , గౌడ సంఘం నాయకులు పంజాల శ్రవణ్ గౌడ్ ,రవి గౌడ్,పర్కాల అంజయ్య గౌడ్ , సత్యనారాయణ,శంకర్ గౌడ్ , పంజాల మల్లేష్,తదితరలు పాల్గొన్నారు.

## గౌడ పురాణం యక్షగానం





**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ కంఠ మహేశ్వర స్వామి కళామండలి ఆధ్వర్యంలో అద్భుతంగా గౌడ పురాణం యక్షగాన ప్రదర్శన చేయడం జరిగింది. కళామండలి ప్రదర్శన రాత్రి నుండి ఉదయం వరకు కళా అభిమానులు తిలకించారు. ఈ కార్యక్రమంలో యక్షగానం కళాకారులు,ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్ర స్వామి మాదిగ, నీడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కానుగంటి శ్రీశైలం కురుమ,కే శ్రీశైలం మల్లన్న కురుమ,గౌడ సంఘం అధ్యక్షుడు నర్సయ్య గౌడ్, గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు సాయన్న సేవలు మరువలేనివి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్ రెడ్డి**



**గణపురం ఏప్రిల్ 02 (తరంగాలు):** తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత ముక్కెర సాయన్న గౌడ్ సేవలు మరువలేనివని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మోతె కరుణాకర్ రెడ్డి అన్నారు. ముక్కెర సాయిలు గౌడ్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల బీఆర్ఎస్ నాయకులు హాజరై సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 23 ఏండ్లు సాయన్న బీఆర్ఎస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఇటు పార్టీ శ్రేణులు, అటు ప్రజల గుండెల్లో అలుపెరగని ఉద్యమ నాయకుడిగా తనదైన ముద్ర వేసున్నారన్నారు. భౌతికంగా సాయన్న మన మధ్య లేకపోయినా ఎప్పుడూ మన మనస్సులోనే ఉంటారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బైరగాని కుమారస్వామి గౌడ్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పొలసాని లక్ష్మీ నరసింహరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పుర్ణ చంద్రారెడ్డి, డాక్టర్ జన్నయ్య, కసిరెడ్డి వెంకటరమణారెడ్డి, కట్ల శంకరయ్య, పులిగిల్ల సమ్మయ్య, బత్తిని శివ శంకర్ గౌడ్, తంగెళ్లపెల్లి వెంకట్ చారి, ఈర్ల రాజు, ఆలూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో నెలకొన్న పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**-ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించాలి**

**-మోట కొండూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి**

**-సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు గౌడ్ డిమాండ్**



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం బుధవారం రోజున సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మండల తహసిల్దార్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున లబ్ధిదారులతో మహాధర్నా ముట్టడి కార్యక్రమం నిర్వహించి అనంతరం మండల డిప్యూటీ తాహాసిల్దార్ వేములపల్లి జయలక్ష్మికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ మహా ధర్నాకు ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు గౌడు పాల్గొని మాట్లాడుతూ మోటకొండూరు మండలం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు అయినప్పటికీ మండలాల పునర్విభజన వల్ల పాలన వికేంద్రీకరణ జరిగి అభివృద్ధిలో సమతుల్యం వేగవంతమైన మార్పు వస్తుందని ప్రజలు ఆశించారని కానీ చిత్తశుద్ధి లేని పాలకుల వైనం వల్ల ప్రజలు ఆశించిన ఫలితాలు అందక పోవడం పాలకుల వైఫల్యాలు మూలంగా జిల్లాలో అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని ఇప్పటికే అనేక గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు పెండింగ్ సమస్యలు అండర్ డ్రైనేజీ సిసి రోడ్లు మంచినీటి సమస్యలు బీటి రోడ్ల సమస్యలు లింకు రోడ్ల సమస్యలు చాలా వరకు పెండింగ్లో ఉన్నాయని ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు మరుగుదొడ్లు వృద్ధాప్య వితంతు పెన్షన్ వెంటనే అందించి ఇబ్బందులు లేకుండా చూడాలని సిపిఎం పార్టీ అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించి కొన్ని సమస్యలు సాధించగలిగిందని అయినా పాలకుల మొద్దు నిద్ర వల్ల సాగు త్రాగునీరు వైద్యం విద్య భూ సమస్యలు వేతనాలు రహదారులు డ్రైనేజీ లాంటి సామూహిక సమస్యలు మరియు ఇలాంటి అనేక సమస్యలు సాధనకై పోరాటం నిర్వహిస్తున్నామని అన్నారు. మండల కేంద్రంలో చుట్టుముట్టు గ్రామాల విద్యార్థిని విద్యార్థులు అనేక మంది వేయ ప్రయాసలకు ఓర్చిచదువుల కోసం దూరా ప్రాంతాలకు ఇబ్బందులు పడుతూవెళు న్నారని తక్షణమే మండల కేంద్రంలోప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్న పట్టించుకోని ప్రజా ప్రభుత్వమని పోలీస్ స్టేషన్ మండల తాసిల్దార్ మండల ప్రజా పరిషత్ వీటన్నింటికీ ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలను సందర్శించి పేరుకుపోయిన సమస్యలను గుర్తించి ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకోవడం జరిగింది. ఈ మహా ధర్నా ముట్టడి కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు,మండల కమిటీ సభ్యులు కొల్లూరి సుధాకర్, ఖాళీయా యాదయ్య, బెల్లంకొండ లక్ష్మి, కొల్లూరి రమేష్, గంజి సంతోష, ఉండాడి బాల నరసమ్మ, కొల్లూరి శ్రీహరి, మలగా సత్తమ్మ, గణేష్, కొల్లూరు నాగరాజు, బైరపాక సర్వేయ్య నాయక్ శంకర్ బోగారం చంద్రమ్మ, కుర్రకంటి నరసమ్మ, అంగడి రాములు, అండాలు, కళమ్మ, యమునా, అనసూయ, హేమలత, మంగళపల్లి చంద్రకళ, ఆసం చంద్రకళ ,సంపూర్ణ ,మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖ ఇల్లు ముట్టడించిన కేయూ విద్యార్థి సంఘాలు






**-విద్యార్థి సంఘాల నాయకులకు,పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట**

**-విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్ కు తరలించి,నిర్బంధించిన పోలీసులు**

**-రాష్ట్ర ప్రభుత్వం హెచ్.సి.యు.భూములను వేలం వేసే ఆలోచనను విరమించుకోవాలి**



**హనుమకొండ ప్రతినిధి,02ఏప్రిల్,తరంగాలు:** హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పై పోలీసులు జరిపిన లాఠీచార్జీని నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు బుధవారం హనుమకొండలోని రాంనగర్ లో గల మంత్రి కొండా సురేఖ ఇల్లు ముట్టడించారు. పోలీసు వలయాన్ని ఛేదించుకొని విద్యార్థులు కొండా సురేఖ ఇంటి గేటు ముందు కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పోలీసులకు విద్యార్థి సంఘ నాయకులకు తీవ్ర వాగ్వాదం తోపులాట జరిగింది. విద్యార్థులను పోలీసులు బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి సుబేదారి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హెచ్.సి.యు. విద్యార్థుల పట్ల కర్కశంగా,అత్యంత పాశవీకంగా వ్యవహరిస్తూ,అక్రమ లాఠీచార్జీలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జికి పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. హెచ్.సి.యు. భూములను కార్పొరేట్,పెట్టుబడిదారులకు అప్పగించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హెచ్సీయూలో చెట్లను నరికి వేస్తూ పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలను విరమించుకోవాలని అన్నారు. ప్రభుత్వ భూములను,విశ్వవిద్యాలయాల భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని తెగ నమ్మాలని చూడటం కంచే చేను మేసిన చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి, భవిష్యత్ విద్యార్థుల ప్రయోజనాలకు, యూనివర్సిటీలో పరిశోధనల అభివృద్ధికి, నాణ్యమైన ప్రయోగశాలల నిర్మాణానికి ఉపయోగపడే భూములను వేలం వేసే పద్ధతులను విడనాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు మొగిలి వెంకట్ రెడ్డి (పి.డి.ఎస్.యు), భాషబోయిన సంతోష్ (ఏఐఎస్ఎఫ్), బి.నరసింహారావు (పి.డి.ఎస్.యు),కే.శ్రావణ్ (డి.ఎస్.ఏ),మాలోత్ రాజేష్ (యుఎస్ఎఫ్ఐ),మర్రి మహేష్ (పి.డి.ఎస్.యు),మంద నరేష్ (ఏ.బి.ఎస్.ఫ్),ఎల్తూరి సాయికుమార్ (ఎస్.ఎస్. యు),కుమ్మరి శ్రీనాథ్ (ఎమ్.ఎస్.ఎఫ్), శివ నాస్తిక్ బిఎస్ఎఫ్, పాల్గొన్నారు. విద్యార్థి సంఘల నాయకులు బి నరసింహారావు, మొగిలి వెంకట్ రెడ్డి, భాష బోయిన సంతోష్, మాలోత్ రాజేష్, కే.శ్రావణ్, మర్రి మహేష్,కె. శ్రీనాథ్, ఇ.సాయి,వంశీ,శివ, సి.హెచ్.వినయ్ లను సుబేదారి పోలీస్ స్టేషన్లో అరెస్టు చేసి నిర్బంధించారు.

## బీసీల కోసం చలో ఢిల్లీ మహాధర్న కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ లో ఆమోదించాలని నిరసిస్తూ బుధవారం రోజు ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘాలకు మద్దతుగా చలో ఢిల్లీ మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ , కొండ సురేఖలతో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఈ ధర్నాలో పాల్గొన్నారు. వీరితోపాటు తెలంగాణ రాష్ట్ర



బీసీ సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.






# రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న బీజేపీ


















-రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
-పేద,బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటమే యాత్ర యొక్క ముఖ్య ఉద్దేశ్యం
-జోరుగా సాగిన జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ రాజ్యాంగద పరిరక్షణ యాత్ర
-పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని అణచివేసే కుట్రలు చేస్తున్న బీజేపీ
-వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్దన్నపేట ప్రతినిధి,02ఏప్రిల్,తరంగాలు:** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుంటూ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ నినాదంతో ఉద్యమిద్దామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు.రాజ్యంగ పరిరక్షణలో భాగంగా జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలనే ఉద్దేశ్యంతో జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు లోకసభ సభ్యులు రాహూల్ గాంధీ,పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే,రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన పాదయాత్రలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,ఇంచార్జ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర రావు,జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,సీనియర్ నాయకులు వరదరాజేశ్వరరావు తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్,స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్ పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పరిరక్షణ యాత్ర ను ప్రారంభించి సుమారు 2 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టి ప్రజలకు జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ముఖ్య ఉదేశ్యాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకుసాగారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని,ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యం అన్నారు.రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదు,అంబేడ్కర్, గాంధీ,పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథం అన్నారు.పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అణగదొక్కాలని చూస్తుందన్నారు.కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్ ను అవమానించారన్నారు.గ్రామ మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని కోరారు. గాంధీ,అంబేడ్కర్ ఆశయాలను,సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఒక్కొకటిగా అమలుపరుస్తూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం అందజేసిన పథకాలను కూడా కొనసాగిస్తుందన్నారు.కానీ బిఆర్ఎస్ నాయకులు పింక్ మీడియా ద్వారా ప్రభుత్వం చేస్తున్న పనులను ఓర్వలేక వ్యతిరేకమైన అంశాలను సోషల్ మీడియా ద్వారా విషం చిమ్ముతుందని అన్నారు.గత పదేళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ రాజ్యంగాన్నీ అవమానపరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తుంది,ప్రజల సమాన హక్కులు,సమ న్యాయం కల్పించాల్సిన పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను కాలరాస్తున్న తీరు తీవ్ర ఆక్షేపనీయంగా ఉంది ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు.అందుకే రాజ్యంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాపాడుకుంటూ జై బాపు, జై భీమ్,జై సంవిదాన్ అభియాన్ నినాదంతో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ,పట్టణ అధ్యక్షులు మైస సురేష్ కుమార్, అయినవోలు మండల అధ్యక్షులు సమ్మెట మహేష్ గౌడ్, పర్వతగిరి మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పత్రి భానుప్రసాద్,యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కుల్ల యాకాంతం,సీనియర్ నాయకులు రాయపురం సాంబయ్య, పోశాల వెంకన్న గౌడ్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కర్ర మాలతీ రెడ్డి,నాయకులు గుజ్జ రవీందర్ రెడ్డి,నాంపల్లి రవీందర్, మల్లపాక సమ్మయ్య,మహ్మద్ అక్బర్,నాంపల్లి యాదగిరి, శ్రీపాది సతీష్,తీగల సునీత,పాక సుజాత,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా పనిచేయాలి





**-ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్,జై సంవిధాన్ నినాదం**

**-అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దేశ సమాజం క్షమించదు**

**-చెల్పూర్ లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో ఎమ్మెల్యే గండ్ర**



**గణపురం, ఏప్రిల్ 02 (తరంగాలు):** రాజ్యాంగపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం గణపురం మండలం చెల్పూర్ లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్నారు. ముందుగా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాల వేశారు. అనంతరం పీఏసీఎస్ కార్యాలయం నుండి బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహం వరకు పాదయాత్రగా చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబెద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ,మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. గాంధీ అంబెద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్ సొసైటీ అధ్యక్షులు గండ్ర సత్యనారాయణ రెడ్డి కన్నెబోయిన కుమార్ యాదవ్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గాజర్ల అశోక్ గౌడ్, మాజీ ఎంపీపీ కావటి రజిత రవిందర్ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు వెంపటిభువన సుందర్, మాజీ జెడ్పిటిసి ముత్యాల రాజయ్య, కొత్త వెంకన్న, పొనగంటి మలహల్ రావు, జెట్టి కనకరాజు, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వర్ధంతి వేడుకలు



**గణపురం ఏప్రిల్ 02 (తరంగాలు):** మండల కేంద్రంలోని కల్లుగీత కార్మిక సొసైటీ ఆవరణలో సంఘం అధ్యక్షుడు మాదాసు రవి గౌడ్ అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేజీ కే ఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్ మాజీ సర్పంచ్ లు నారగాని దేవేందర్ గౌడ్ మోటపోతుల శివశంకర్ గౌడ్ గౌడ సంఘం జిల్లా నాయకులు ల్యాదళ్ల సమ్మయ్య గౌడ్ గుర్రం తిరుపతి గౌడ్ మాజీ అధ్యక్షులు అరెల్లి రాజు, గుర్రం సురేష్ గడ్డమీది రవీందర్, మదాసు అర్జున్ గౌడ్ మార్క మొగిలి గౌడ్ పాలకవర్గ ఉపాధ్యక్షులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా పదవి విరమణ వీడ్కోలు అభినందన సభ

**ప్రముఖులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు**



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన దూడల వెంకటేష్ గౌడ్ చింగిచెర్ల డిపో స్టేషన్ మాస్టర్గా పదవి విరమణ పొందిన సందర్భంగా బుధవారం రోజు యాదగిరి పల్లి శుభం గార్డెన్లో ఏర్పాటుచేసిన పదవి విరమణ వీడ్కోల అభినందన సభ కార్యక్రమానికి విచ్చేసిన పుర ప్రముఖులు జనగాం రవీందర్ రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కాచారం రేణుక ఎల్లమ్మ ఆలయ పూజారి వంగపల్లి అంజయ్య స్వామి గుప్తాల ఆశీర్వాదం పొందినారు. ఈ కార్యక్రమంలో పత్రికా విలేఖరి కొంతం సిద్ధార్థ గౌడ్ ,జనగాం వెంకట్రెడ్డి, గంగరాజు రామకృష్ణ, బాకీ యోహాను ,గ్రామస్తులు, తదితరులు పదవి విరమణ వీడ్కో సమావేశంలో పాల్గొని దూడల వెంకటేష్ గౌడ్ వారి సతీమణి ఉమాను శాల్వాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలియజేసినారు.

## ఉచిత సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అందరితో పాటు పేదలు కూడ మంచి ఆహారాన్ని తినాలని వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలని ఉచితంగా సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ రోజున ప్రారంభించటం జరిగింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశానుసరం బుధవారం రోజు తుర్కపల్లి మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో సన్న బియ్యం కార్యక్రమాన్ని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో మండల తహసీల్దార్,ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, కార్యదర్శి, గ్రామ ముఖ్య నాయకులు, సంఘ బంధం అధ్యక్షురాలు, ఫీల్డ్ అసిస్టెంట్, పెద్దలు, రేషన్ కార్డు దారులు,గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మృతుడు తోటకూరి మల్లయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందచేత



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో తేది 28-03-2025 శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తోటకూర మల్లయ్య యాదవ్ (60) అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న బిర్లా ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత మరియు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లు బుధవారం రోజు వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కోసన అంజయ్య మరియు తాజామాజీ సర్పంచ్ కొమిరెల్లి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కొన్న కిష్టయ్య మరియు నాయకులు గొడ్డటి ఎల్లయ్య, బొంత మల్లయ్య,కొన్న మల్లేష్, తోటకూరి మల్లయ్య,టి మల్లయ్య, బట్టు మురళి, బట్టు మహేష్, బొంత మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తూర్పుగూడెంలో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం తూర్పుగూడెం గ్రామం లో బుధవారం రోజున సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘం అధ్వర్యంలో పువ్వులమాల వేసి ఘనంగా నివళులర్పించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## బీసీల పోరు గర్జనలో పాల్గొన్న బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్




**మిర్యాలగూడ ఆర్సీ, 2ఏప్రిల్, తరంగాలు:** బీసీల రిజర్వేషన్ల సాధన కోసం ఈరోజు న్యూ ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద జరిగిన మహాధర్నా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనగణన లో కుల గణన చేపట్టాలని,తెలంగాణ అసెంబ్లీలో స్థానిక సంస్థల్లో మరియు విద్యా,ఉద్యోగ రంగాల్లో 42 శాతం పెంచుతూ చట్టం చేశారని ఈ 42 శాతాన్ని పార్లమెంట్ లో చట్టం చేసి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య,గుండెబోయిన నాగేశ్వ రావు,ఎస్పీ నాయుడు, చేగోండి మురళి, నక్క నాగరాజు,యాదగిరి, శ్రీను, చిలుకూరి రాజేష్,హరితేజ, కృష్ణ, తాడూరి సైదులు, తదితరులు పాల్గొన్నారు

## మహానీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

**మహనీయుల జయంతోత్సవాల బైక్ స్టిక్కర్ ఆవిష్కరణ"చేసిన డీసీపీ ఆకాంక్ష్ యాదవ్**



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణం ఏప్రిల్ నెల 5తారీకు నుండి 14తారీకు వరకు జరిగే మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ ల జయంతి ఉత్సవాలను సామరస్య పూర్వహక వాతావరణంలో జరుపుకోవాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు ఆకాంక్ష్ యాదవ్ అన్నారు. మహనీయుల జయంతోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రోజున డిసిపిని కలిసి ఐదవ తేదీనుండి పద్నాలుగవ తేదీవరకు నిర్వహించే కార్యక్రమాలను వివరించడం జరిగింది.ఈ సందర్భంగా డిసిపి ఆకాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ మహనీయుల జయంతులను ప్రశాంతంగా నిర్వహించాలని నిర్వాహకులు మంచి కార్యాచరణతో ముందుకెళ్లాలని అన్నారు. మహనీయుల జయంతోత్సవాలలో భాగంగా నిర్వహించే భీమ్ యాత్ర బైక్ స్టిక్కర్లను ఆవిష్కరించి బైక్ లకు అంటించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ నాయకులు బర్రె జహంగీర్, మొహమ్మద్ ఇలియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే యాదాద్రి భువనగిరి జిల్లాలో చారిత్రాత్మకంగా జరిగే మహనీయుల జయంతి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని ఇందుకు అధికారులు సహకరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ నాయకులు బట్టు రామచంద్రయ్య, బర్రె జహంగీర్, దొనకొండ రాములు, బండారు రవివర్ధన్, ఈరపాక నర్సింహ, పడిగెల ప్రదీప్, వెంకట నర్సింగ్ నాయక్, ఎం డి ఇలియాస్, సురుపంగ శివలింగం, కర్తాల శ్రీనివాస్, దర్గాయి హరిప్రసాద్, ఇటుకల దేవేందర్, దుబ్బ రామకృష్ణ, పొలిశెట్టి అనిల్ , డాకూరి ప్రకాష్, నాగరం శంకర్, బానోతు భాస్కర్ నాయక్,అందె నరేష్, అందే సాయి తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 315వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన

**భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**ఆలేరు ఆర్సీ, ఏప్రిల్ 02(తరంగాలు):** బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అవిశ్రాంత పోరాటం చేసిన సర్దార్ సర్వాయి పాపన్న నేటి తరానికి ఆదర్శనీయుడని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో సర్వాయి పాపన్న 315వ వర్ధంతి సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి వీరుడు సర్వాయి పాపన్న అని కీర్తించారు.సాధారణ కుటుంబంలో జన్మించి పశువుల కాపరిగా, గీత కార్మికుడిగా కొనసాగిన తన ప్రస్థానంలో అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహాయోధుడు పాపన్న అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, ఎంపీ కావ్య, పోరిక బలరాం నాయక్, రఘురాం రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI . TELTEL / 2022 / 83463

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

**-డిఇఓ రమేష్ కుమార్**

**నాగర్ కర్నూల్,ఏప్రిల్ 2,తరంగాలు ప్రతినిధి:** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ సంఘటనలు జరగకుండా నిర్వహించామని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న చివరి సోషల్ పరీక్షను డీఈఓ రమేష్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షల విధులను సమర్థవంతంగా నిర్వర్తించిన అధికారులకు డీఈఓ రమేష్ కుమార్ అభినందనలు తెలిపారు.చివరి సోషల్ పరీక్షకు 99.75 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు.అనంతరం డిఇఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఎలాంటి మాస్ కాపీయింగ్ కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు ముగిశాయని డిఇఓ తెలిపారు.ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు,



ఇన్విజిలేటర్లు కి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించారన్నారు.విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఏ చిన్న ఘటన కూడా జరగకుండా జిల్లాలో జాగ్రత్తలు పాటించిన చీఫ్ సూపరిండెంట్లు, డిపార్మెంట్ల అధికారులు, ఇన్విజిలేటర్లు, పరీక్షల నిర్వహణ అధికారులందరిని డిఇఓ రమేష్ కుమార్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో తనిఖీ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని అన్నారు. బుధవారం జరిగిన చివరి సోషల్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా నిర్వచించిన 60 పరీక్షా కేంద్రాల్లో 10,555 మంది విద్యార్థులకు గాను 10,529 మంది విద్యార్థులు నేటి సాంఘిక శాస్త్రం పరీక్షకు హాజరయ్యారని, 26 మంది విద్యార్థులు నేటి పరీక్షకు గైర్హాజరయ్యారని, 99.75శాతం హాజరు శాతం నమోదయిందని డీఈవో తెలిపారు.గత నెల 21వ తేదీ నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు జిల్లాలో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ పి అమరేందర్, వివిధ శాఖల అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షలు సజావుగా జరిగేలా సూచనలు అందజేశారని, వారి సూచనల మేరకు పరీక్షలను సమర్థవంతంగా నిర్వర్తించడం జరిగిందని ఈ సందర్భంగా డిఇఓ తెలిపారు.

# చెత్తతో అద్భుతాలు సృష్టించడం అభినందనీయం





**-హైదరాబాద్ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన కలెక్టర్లు, కమిషనర్**

**-ఆధునిక టెక్నాలజీ తో చెత్త నుండి వేరు చేస్తున్న వివిధ పద్ధతుల పరిశీలన**

**-జీడబ్ల్యూఎంసీ పరిధిలోనూ ఇదే తరహా విధానం అమలుకు యోచన**

**-శుక్రవారం రాంపూర్ డంపింగ్ యార్డు ను పరిశీలించనున్న రాంకీ సంస్థ ప్రతినిధులు**





**హైదరాబాద్/2 ఏప్రిల్,తరంగాలు:** జిహెచ్ఎంసి పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డును వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం సందర్శించారు. జీహెచ్ఎంసీలో అమలవుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతి, చెత్త నుంచి విద్యుత్తు తయారీ, చెత్త ట్రాన్స్ఫర్ తయారీ స్టేషన్లను వారు పరిశీలించారు.హైదరాబాద్ లోని వివిధ డివిజన్ల నుండి చెత్తను ఏ విధంగా తరలిస్తున్నారు, డంపింగ్ యార్డు వద్ద ఎలాంటి పద్ధతులను అనుసరిస్తు న్నారు, చెత్తను ఏ విధంగా రీసైక్లింగ్ చేస్తున్నారనే విషయాలను క్షేత్రస్థాయిలో ఇరువురు కలెక్టర్లు, కమిషనర్ అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ చెత్తతో విద్యుత్తును ఉత్పత్తి చేయడం అద్భుతమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌కు తరలించి ఆధునిక టెక్నాలజీతో అద్భుతాలు సృష్టించడం అభినందనీయమని కలెక్టర్లు కొనియాడారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో చెత్త నుంచి కరెంట్, గ్యాస్‌ను తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించామని, ఇదే తరహాలో గ్రేటర్ వరంగల్ లో అభివృద్ధి చేస్తామని చెప్పారు. డంపింగ్‌యార్డ్‌లో కొత్త టెక్నాలజీతో చేస్తున్న అధ్యయనాలు బాగున్నాయని వారు ఈ సందర్భంగా కితాబిచ్చారు.సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టడీ టూర్‌లో భాగంగా డంపింగ్‌యార్డ్‌ను సందర్శించిన కలెక్టర్లు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్త నుండి వేరు చేయడానికి అనుసరిస్తున్న ఆధునిక పద్ధతులు, వ్యర్థ పదార్థాల ద్వారా వివిధ రకాల ఉత్పత్తి, నిర్వహణ గురించి కలెక్టర్లు, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ లకు ఘన వ్యర్థాల నిర్వహణ చేపడుతున్న రాంకీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంపూర్ డంపింగ్ యార్డు ను జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వద్ద సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్న రాంకీ సంస్థ ప్రతినిధులు జిడబ్ల్యూఎంసీ కు శుక్రవారం సందర్శించి రాంపూర్ డంపింగ్ యార్డ్ వద్ద శాశ్విత ప్రతిపాదికన అనుసరించవలసిన పద్ధతులను, సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిడబ్ల్యూ ఎంసీ ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, సంబంధిత అధికారులు, రాంకి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న తాళ్లపూసపల్లి గ్రామ లబ్ధిదారులు

**కేసముద్రం,ఏప్రిల్ 02, (తరంగాలు)** సీఎంఆర్ఎఫ్ చెక్కులను కేసముద్రం మండలం తల్లపూస పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ చేతుల మీదుగా అందుకున్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే మురళి నాయక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం తాళ్లపూస పల్లి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులు దొంతబోయిన కొమురయ్య 60 వేల రూపాయలు,తుమ్మ మల్లయ్య 48 వేల రూపాయలు, బయ్య వెంకన్న 30,000 రూపాయల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అల్లం నాగేశ్వరరావు,తాళ్లపూస పల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య,శీలం యాకయ్య,కాలేరు వెంకన్న, రాచర్ల రాములు,తీగలదశరథం తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన మాజీ సర్పంచ్ గొల్లపల్లి రాజేశ్వరి సోమయ్య

**కేసముద్రం, ఏప్రిల్ 02, (తరంగాలు)** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నటువంటి ప్రజా పాలనలో భాగంగా ఉచిత సన్న బియ్యం కార్యక్రమాన్ని పెద్దలు డిసిసి అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి, మహబూబాబాద్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న జనహృదయనేత మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ ఆదేశాల మేరకు రంగాపురం గ్రామంలో బుధవారం సన్న బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు రంగాపురం గ్రామ మాజీ సర్పంచ్ గొల్లపల్లి రాజేశ్వరి సోమయ్య గౌడ్. అదేవిధంగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇల్లు,నల్లాల బావి, వాటర్ ట్యాంక్, ఆర్ అండ్ బి రోడ్, గ్రామపంచాయతీ కార్యాలయం లు మంజూరు చేయడం లాంటివి రంగాపురం గ్రామంలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య మాలు,మాజీ సర్పంచ్ భూక్య రాములు,డీలర్ ఖాజా పాషా, తదితరులు పాల్గొన్నారు.




## భూముల వేలాన్ని ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**అరెస్టు చేసిన ఎస్ఎఫ్ఐ, సిపిఎం పార్టీ నాయకులను వెంటనే విడుదల చేయాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య**



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 02,(తరంగాలు):** హైదరాబాద్ సెంటర్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల యూనివర్సిటీ భూములను వేలాన్ని ఆపకపోతే ఉద్యమం ఉదృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులు, యూనివర్సిటీ భూములను వేలాన్ని ఆపాలని నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. మాట్లాడుతూ పోలీసులు అరెస్టు చేసిన విద్యార్థులను, వామపక్ష నాయకులను, ప్రజా సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రపంచంలోనే గుర్తింపు కలిగిన యూనివర్సిటీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల విక్రయాలను వెంటనే ఆపివేయాలని హెచ్చరించారు. ప్రభుత్వ యూనివర్సిటీ వేలాన్ని ఆపాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భూములను ప్రజా అవసరాల కోసం వినియోగించాలి కానీ, పెట్టుబడిదారుల కారు చౌకగా కట్టబెట్టడం దారుణం అన్నారు. కెసిఆర్ చేసిన పనిని రేవంత్ రెడ్డి చేస్తూ ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడడం చాలా బాధాకరం అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ అరెస్టు చేస్తే సిపిఎం పార్టీ ప్రత్యక్ష ప్రజా ఆందోళన దిగుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని ఆపుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి షబానా, గుండెబోయిన రాజు ,కాట సుధాకర్, వడ్లకొండ సుధాకర్, నల్ల తీగల శ్రీను, ఎస్.కె ఇక్బాల్, నక్క యాకయ్య, రాపర్తి రజిత, శోభ, భారతమ్మ, రజిత, వేల్పుల పెద్ద రాములు, ఎర్ర రవి, చిరంజీవి ,శంషాద్దీన్, నక్క బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఊరుకొండ అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు**



**కల్వకుర్తి,ఏప్రిల్ 2,తరంగాలు ప్రతినిధి:** ఊరుకొండ అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు అన్నారు.ఊరుకొండ పేట అత్యాచారం ఘటన సభ్య సమాజం తలదించుకునేలా అత్యంత హేయమైన చర్య అది కూడా గుడిలో పనిచేసే వ్యక్తి ఇలాంటి ఘటనలకు పాల్పడితే వచ్చే భక్తులు భయ భ్రాంతులకు గురవుతారని ఇలాంటి సంఘటనలు గతంలో ప్రతి శనివారం ఎన్నో ఇలాంటి సంఘటనలు జరిగినట్లుగా అనుకుంటున్నారని వారిపై కఠినమైన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయం డిటి కి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.బాధితురాలికి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని,ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఉపాధి కల్పించడంతోపాటు ఆమె ముగ్గురు పిల్లలను చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు పులిజాల పరుశురాములు,చిలుక బాల్రెడ్డి కిషోర్,(సిఐటియు) భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవిపిఎస్, జిల్లా నాయకుడు చంద్రయ్య, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు రాము, నాయకుడు పరుశురాములు, తదితరులు పాల్గొన్నారు.

MOVIES TIME

గురువారం 3 ,ఏప్రిల్ 2025

తరంగాలు
Tharangalu Daily News Paper



## కొత్త దర్శకుడితో నాగచైతన్య 25వ చిత్రం.!

తండేల్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు అక్కినేని హీరో నాగచైతన్య . చందు మొండేటి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో సాయి పల్లవి కథానాయికగా నటించింది. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన జాలర్లు గుజరాత్‌లో చేపల పట్టడానికి వెళ్లి అక్కడ పాకిస్థాన్ కోస్ట్ గార్డులకు చిక్కుతారు. అయితే వీరిని భారత ప్రభుత్వం ఎలా బయటకు తీసుకువచ్చిందనే కథతో ఈ సినిమా వచ్చింది. ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.అయితే ఈ సినిమా అనంతరం నాగ చైతన్య 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండుతో ఓ మిథికల్ థ్రిల్లర్ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మొదలుపెట్టిన ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ చిత్రం చైతూ కెరీర్‌లో 24వ సినిమాగా తెరకెక్కుతుండగా.. తన 25వ చిత్రం కోసం భారీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. తెలిసిన దర్శకులను కాకుండా ఈసారి కిషోర్ అనే కొత్త దర్శకుడితో తన 25వ చిత్రం చైతూ చేయబోతున్నాడని టాక్. కిషోర్ చెప్పిన కథ చైతన్యకి బాగా నచ్చడంతో సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. కాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఆలియా భట్‌తో పోల్చకండి ప్లీజ్....

### నటి షాలినీ పాండే వెల్లడి

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



## నేను ఎవరితో డేటింగ్‌లో లేను

### - దివ్య భారతి

తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ గాయని సైంధవి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే జీవీ విడాకులు తీసుకోవడానికి కారణం హీరోయిన్ దివ్య భారతితో ప్రేమలో ఉన్నందుకే అంటూ సోషల్ మీడియాలో పుకార్లు పుట్టుకోచ్చాయి. ఈ వివాదంపై జీవీ ప్రకాశ్‌తో పాటు దివ్యభారతి గతంలోనే స్పందించారు. అయితే ఈ వివాదం ఇంకా ముగియకపోవడంతో తాజాగా ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టింది దివ్యా భారతి.నాకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల కుటుంబపు విషయాల్లో నా పేరును లాగుతున్నారు. జీవీ ప్రకాశ్ కుటుంబ సమస్యలతో నాకు ఎటువంటి లింక్ లేదు. నేను ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. నేను ఎవరితోనూ డేటింగ్‌లో లేను. ముఖ్యంగా పెళ్లైన వ్యక్తితో డేటింగ్ అసలే చేయను. ఆధారాలు లేకుండా రూమర్స్‌ను పుట్టించొద్దు. ఇప్పటివరకూ ఈ విషయంపై నేను నోరు మెదపలేదు. కానీ, కొన్ని రోజులుగా ఈ రూమర్స్ నా సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఈ గాసిప్‌ల వల్ల నా పేరు చెడిపోతోంది. తప్పుడు వార్తలు సృష్టించడం కంటే సమాజానికి ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టండి. నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి. ఈ విషయంపై ఇదే నా తొలి మరియు చివరి ప్రకటన అని దివ్య భారతి చెప్పుకోచ్చింది. దివ్య భారతి, జీవీ కలిసి బ్యాచిలర్, కింగ్‌స్టన్ మూవీలో నటించారు. ఈ క్రమంలో వీరిద్దరు రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది.





## కృతి శెట్టి బాటలోనే శ్రీలీల పయనిస్తుందా

### ఒకప్పుడు గోల్డెన్ లెగ్, ఇప్పుడు ఐరెన్ లెగ్..!

ఇటీవలి కాలంలో హీరోయిన్స్‌కి లక్ అనేది ఎక్కువ రోజులు ఉండడం లేదు. రెండు మూడు వరుస హిట్స్‌తో గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న ఈ భామలు ఆ తర్వాత వరుస ఫ్లాపులు దక్కించుకొని కెరీర్ సందిగ్ధంలో పడేలా చేసుకుంటున్నారు. రకుల్,తమన్నా, పూజా హెగ్డే, కృతి శెట్టి వంటి వారు ఒకప్పుడు ఊపేశారు. కాని ఇప్పుడు వారికి అవకాశాలే కరువయ్యాయి. ఉప్పెన సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన కృతి శెట్టి అదే జోరును కొనసాగిస్తూ హ్యాట్రిక్ హిట్ ను సొంతం చేసుకుంది. అందంతో పాటు అదృష్టం కూడా ఉందని అంతా అనుకున్నారు.కానీ ఆ తరువాతనే కృతి శెట్టికి పరాజయాలు పలకరించాయి . గ్లామర్ విషయంలో వంకబెట్టవలసిన పనిలేదు. డాన్స్ విషయంలోను ఈ బ్యూటీ శభాష్ అనిపించుకుంది. ఇక ఈ ట్రెండ్ కి తగ్గట్టు యాక్టింగ్‌తో అదరగొడుతుంది. కానీ దురదృష్టం కొద్దీ ఆమెను ఫ్లాపులు పలకరించడంతో తెలుగులో అవకాశాలు తగ్గాయి. దాంతో తమిళ .. మలయాళ సినిమాలపై శ్రద్ధ పెట్టింది. ఇప్పుడు ఇదే రూట్లో శ్రీలీల పోతున్నట్టుగా కనిపిస్తుంది. తెలుగులో వరుస హిట్లతో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న శ్రీలీల బిజీ హీరోయిన్‌గా మారింది. అవకాశాలు పలకరిస్తూ ఉన్నా కూడా అవన్నీ కూడా బాక్సాఫీస్ దగ్గర తేలిపోతున్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్?ట్రార్డినరీ మ్యాన్ ఇలా శ్రీలీల నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఆ తర్వాత వచ్చిన గుంటూరు కారం సినిమాతో ఓ హిట్ పడింది. కానీ ఈ సినిమా శ్రీలీలకు అంత ప్లస్ కాలేదు. పుష్ప 2లో కిస్సిక్ పాటతో కాస్త అలరించింది. ఇక ఇటీవల నితిన్ హీరోగా తెరకెక్కిన రాబిన్ హుడ్ సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఈ మూవీకి మిశ్రమ స్పందన వచ్చింది. ఈ మధ్య కాలంలో శ్రీలీలకి హిట్ అనేదే పడడం లేదు. ఇలానే చేసుకుంటూ పోతే కెరీర్‌లో పట్టుమని పది సినిమాలు కూడా చేయకుండానే ఫేడ్ అవుట్ కావల్సి వస్తుంది. ఇప్పటికైన శ్రీలీల జాగ్రత్త పడాలి. త్వరలో రవితేజతో కలిసి మాస్ జాతర అనే సినిమాతో ప్రేక్షకులని పలకరించనుంది. కార్తీక్ ఆర్యన్ సరసన డెబ్యూ చేస్తూ నటిస్తున్న బాలీవుడ్ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతోంది. దీని మీద అమ్మడికి చాలా ఆశలున్నాయి.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com